నేడు పీజీఆర్ఎస్ రద్దు

శ్రీకాకుళం కలెక్టరేట్/క్రైం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): జడ్పీ కార్యాలయంలో సోమవారం జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని దీపావళి సందర్భంగా రద్దు చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగే పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని కూడా రద్దు చేసినట్లు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.



దీపావళి శోభ

- కొనుగోలుదారులతో బాణసంచా దుకాణాలు కిటకిట
- షాపుల వద్ద కానరాని నిబంధనలు



జనప కర్రలు కొనుగోలు చేస్తున్న దృశ్యం



క్రాకర్స్‌ను ఇంటికి తీసుకువెళ్తున్న పిల్లలు

శ్రీకాకుళం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో దీపావళి శోభ ఉట్టిపడుతోంది. యువకులు, పెద్దలు బాణసంచా దుకాణాలకు బారులు తీరుతున్నారు. సమయం లేకపోవడంతో ఆదివారం భారీ స్థాయిలో మందుగుండును కొనుగోలు చేశారు. మార్కెట్‌లో కొత్తగా దిగిన మతాబులు, బాంబులు, తారాజువ్వలను కొనడం కనిపించింది. ప్రధాన మార్కెట్లు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. తాత్కాలిక బాణాసంచా దుకాణాలు కూడా భారీగా ఏర్పాటయ్యాయి. ఒక్క శ్రీకాకుళం నగరంలోనే 22 తాత్కాలిక షాపులు ఏర్పాటయ్యాయి. మండల కేంద్రాల్లో, ముఖ్య పట్టణాలు, మేజర్ పంచాయతీల్లో రెండు, మూడు చొప్పున తాత్కాలిక షాపులు వెలిశాయి. అయితే తాత్కాలిక దుకాణాల వద్ద కనీస నిబంధనలు పాటించడం లేదన్న విమర్శలున్నాయి.



శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన దుకాణాల్లో టపాసులు కొనుగోలు చేస్తున్న ప్రజలు

బీలకు మహర్దశ

- చిత్తడి నేలల పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు
- పర్యాటకంగా అభివృద్ధి చేయాలని నిర్ణయం
- పెద్దమొత్తంలో వెచ్చించనున్న నిధులు
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు

సోంపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బీల ప్రాంతానికి మహర్దశ పట్టనుంది. సోంపేట, కవిటి, కంచిలి మండలాల్లో విస్తరించి ఉన్న వేలాది ఎకరాల చిత్తడి నేలల పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. చిత్తడి నేలలను అనుసంధానిస్తూ భారీ పర్యాటక ప్రాజెక్టుకు రూపకల్పన చేయాలని నిర్ణయం తీసుకుంది. కారిడార్‌గా అభివృద్ధి చేసి పర్యాటక రంగాన్ని పరుగులు పెట్టించాలని తాజాగా ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అధికారులను ఆదేశించారు. దీంతో స్థానికుల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

ఇదీ బీల నేపథ్యం..

సోంపేట, కవిటి, కంచిలి మండలాల్లో విస్తరించి ఉన్న బీల ప్రాంతంలో 800 హెక్టార్ల పరిధిలో విశిష్ట చిత్తడి నేలలు ఉన్నాయి. ఇక్కడి సహజ సిద్ధ జలాశయాలతో ఏడాది పొడవునా నీటి నిల్వలు ఉంటాయి. 20వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. 32వేల ఎకరాల కొబ్బరి తోటలకు భూగర్భ జలాలు అందుతాయి. 1.5లక్షల మంది తాగునీటి అవసరాలు తీరుతున్నాయి. బీలలో బొగ్గు ఆధారిత థర్మల్ ప్లాంట్ నిర్మాణానికి 2007లో అప్పటి ప్రభుత్వం ఎన్‌సీసీ సంస్థకు భూమిని కేటాయించింది. 33 గ్రామాల మధ్యలో ఉన్న 973 ఎకరాలకు గాను 600 ఎకరాలు సేకరించింది. దీన్ని స్థానికులు తీవ్రంగా వ్యతిరేకించారు. 2008లో ఉద్యమం మొదలైంది. 2010 జూలై 14న వేలాది మంది పోలీసులతో వచ్చి థర్మల్ ప్లాంట్‌కు భూమి పూజ చేసేందుకు ప్రయత్నించగా బీల ప్రజలు అడ్డుకున్నారు. పోలీసుల కాల్పుల్లో ముగ్గురు రైతులు అమరులయ్యారు. ఈ క్రమంలో అప్పటి ప్రతి పక్షనేత చంద్రబాబు నాయుడు ఈ ప్రాంతంలో పర్యటించి ఇక్కడి ప్రజలకు భరోసా ఇచ్చారు. 2014లో టీడీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే థర్మల్ జీవో 1107ను రద్దు చేశారు.



సోంపేటలోని బీల భూములు

పవన్‌కల్యాణ్ హామీతో..

2018 మే 21న జనసేన అధినేత పవన్‌కల్యాణ్ బీలలో పర్యటించారు. పర్యావరణాన్ని కాపాడి, బీలను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. 2011లో ఆరు నెలలపాటు కేంద్ర బృందాలు కూడా బీలలో పర్యటించి ఇక్కడి నేలలను విశిష్ట చిత్తడి నేలలుగా గుర్తించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సిఫారసు చేశాయి. తాజాగా ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ రాష్ట్రంలోని చిత్తడి నేలల పరిరక్షణ కోసం రాష్ట్ర వెట్‌ల్యాండ్ అథారిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సోంపేట, కవిటి, కంచిలి మండలాల్లో విస్తరించి ఉన్న వేలాది ఎకరాల చిత్తడి నేలలను అనుసంధానిస్తూ భారీ పర్యాటక ప్రాజెక్టుకు రూపకల్పన చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఇందుకోసం అటవీశాఖ వన్యప్రాణి విభాగం ఆధ్వర్యంలో చర్యలు చేపట్టాలని డిసైడ్ అయ్యారు. పెద్దబీల, చిన్నబీల, తంపర భూములు, చిత్తడి నేలలను కారిడార్‌గా అభివృద్ధి చేసి పర్యాటక రంగాన్ని పరుగులు పెట్టించాలని ఉపముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ (మిగతా 6వ పేజీలో..)

రూ.10 కోట్లతో శ్రీకూర్మక్షేత్రం అభివృద్ధి

- మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత
- కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు



శ్వేత పుష్కరిణిని పరిశీలిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

గార, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): శ్రీకూర్మ క్షేత్రాన్ని రూ.10 కోట్లతో అభివృద్ధి చేస్తామని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. ఆదివారం శ్రీకాకుళం, విజయనగరం ఎమ్మెల్యేలు గొండు శంకర్, అదితి గజపతిరాజు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి ఆయన శ్రీకూర్మం క్షేత్రాన్ని దర్శించుకున్నారు. స్వామివారి సన్నిధిలో వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ట్రస్ట్ బోర్డు సభ్యులు, స్థానిక పెద్దలతోకలసి శ్వేత పుష్కరిణి పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ.. ఈ దేవస్థానాన్ని ఆధ్యాత్మికంగా మరింత అభివృద్ధి చేసేందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందిస్తామని తెలిపారు. 'ఎమ్మెల్యే శంకర్, వంశపారంపర్య ధర్మకర్త, గోవా గవర్నర్ అశోక్‌గజపతిరాజు (మిగతా 6వ పేజీలో..)

వరిలో ఎలుకల బెడద

- పొట్ట దశలో పంటను కొరికేస్తున్న వైనం
- దిగుబడిపై రైతుల్లో ఆందోళన



నరసన్నపేట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): వరి పంటలో ఎలుకల బెడద ఎక్కువైంది. పొట్ట దశలో పంటపై దాడి చేస్తున్నాయి. పొట్ట భాగాన్ని కొరికేసి తినేస్తున్నాయి. దీంతో పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం పడనుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో జిల్లాలో 3.75 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. విత్తనాలు, ఎరువులు, దమ్ములు, నాట్లు కోసం అధికంగా పెట్టుబడి పెట్టారు. తెగుళ్ల నివారణకు మందులు కూడా స్ప్రే చేశారు. మరో నెల రోజుల్లో పంట చేతికందుతుందన్న సమయంలో ఎలుకలు విజృంభిస్తున్నాయి. దీంతో పంట రక్షణకు రైతులు పడరాని పాట్లుపడుతున్నారు. లక్ష ఎకరాల్లో ఎలుకల దాడి ప్రభావం ఎక్కువగా ఉంది. ఎకరానికి రెండు బస్తాల వరకు నష్టం వస్తుందని రైతులు చెబుతున్నారు. గతేడాది కంటే ఈ ఏడాది సకాలంలో వర్షాలు పడడంతో దిగుబడులు ఎక్కువగా వస్తాయని రైతులు ఆశించారు. అయితే, నల్లదోమ, తెల్లదోమతోపాటు ఎలుకల బెడదతో జిల్లాలో సుమారు 30వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి తగ్గే అవకాశాలు కన్పిస్తున్నాయని రైతులు చెబుతున్నారు.

దిగుబడులు తగ్గుతాయి



వరిలో ఎలుకల బెడద ఏడాదికేడాది పెరుగుతుంది. నా ఎకరా వరి చేనులో 8సెంట్లను పూర్తిగా పాడు చేశాయి. పొట్ట దశలో పంటను కొరికేస్తున్నాయి. మరొకవైపు దోమతో ఈఏడాది వరి దిగుబడులు తగ్గుతాయి. పెట్టుబడులు ఎకరాకు అదనంగా రూ.5వేల వరకు పెరిగాయి.

-కొత్తరెడ్డి కృష్ణారావు, రైతు, జమ్ము



బాణసంచాతో బహుపరాక్
- దీపావళి వేళ.. జాగ్రత్తలు తప్పనిసరి
6లో

అంతర్గత భద్రతలో అలుపెరగని పోరాటం
- వారి త్యాగాలు వెలకట్టలేనివి
- నేడు జాతీయ పోలీసు అమరవీరుల దినోత్సవం
6లో

ఆదిత్యుని ఆదాయం రూ.3.50 లక్షలు
7లో

కుండపోత వర్షం
6లో

కందిపప్పు ఏదీ?

- 9 నెలలుగా నిలిచిన సరఫరా
- రేషన్‌కార్డుదారులకు నిరాశ



ఇచ్ఛాపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) జిల్లాలో రేషన్ డిపోల ద్వారా అందించే నిత్యావసరాల పంపిణీలో కేవలం రెండింటికే పరిమితమవుతున్నారు. బియ్యంతోపాటు పంచదార మాత్రమే అందిస్తున్నారు. గత తొమ్మిది నెలలుగా కందిపప్పు అందించడం లేదు. దీంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఎదురైంది. జిల్లావ్యాప్తంగా 1603 రేషన్ డిపోలు ఉన్నాయి. వీటి పరిధిలో 6,51,778 రేషన్ కార్డులు ఉన్నాయి. ప్రతినెలా రేషన్‌కార్డుదారులకు బియ్యం, అరకేజీ పంచదార మాత్రమే పంపిణీ చేస్తున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో రేషన్ పంపిణీలో భాగంగా 12 రకాల వస్తువులు అందించేవారు. బియ్యం, పంచదార, కందిపప్పు కిరోసిన్, పామాయిల్, శెనగలు, వివిధ రకాల నిత్యావసరాలు అందించేవారు. కానీ తరువాత వచ్చిన ప్రభుత్వాలు రేషన్‌లో కోత విధిస్తూ వచ్చాయి. వైసీపీ హయాంలో అయితే కేవలం బియ్యం, పంచదార మాత్రమే పంపిణీ చేశారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత కొన్నాళ్లు కందిపప్పును అందించారు. కానీ, గత తొమ్మిది నెలలుగా రేషన్‌కార్డుదారులకు కందిపప్పు ఇవ్వడం లేదు. దీంతో ప్రతినెలా రేషన్‌కార్డుదారులు నిరాశ చెందుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ.150 వరకూ పలుకుతోంది. దీంతో అంత ధర ఇచ్చి కొనుగోలు చేయలేకపోతున్నామని సామాన్యులు వాపోతున్నారు. కనీసం కార్తీక మాసం దృష్ట్యా నవంబరు నెలలో అయినా రేషన్ డిపోల్లో కందిపప్పు అందించాలని కోరుతున్నారు. ఈ విషయమై డీఎస్‌వో సూర్యప్రకాశరావు వద్ద ప్రస్తావించగా.. 'ప్రభుత్వం కందిపప్పు సరఫరాను నిలిపివేసింది. అందుకే అందించలేకపోతున్నాం. ప్రభుత్వం దృష్టికి ఈ సమస్య తీసుకెళ్లామ'ని తెలిపారు.

పుట్టినరోజు వేడుకలు చేసుకునేందుకు వెళ్లి..

- సముద్రంలో యువకుడి గల్లంతు
- ప్రాణాలతో బయటపడిన నలుగురు స్నేహితులు
- మొగదాలపాడు తీరంలో ఘటన

పొందూరు/గార, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పుట్టినరోజు వేడుకలు చేసుకునేందుకు స్నేహితులతో కలిసి వెళ్లిన తన కుమారుడు తిరిగి వస్తాడని చూస్తున్న ఆ తల్లిదండ్రులకు పిడుగులాంటి వార్త అందింది. సముద్ర స్నానం చేస్తుండగా తన కుమారుడు అలల తాకిడికి గల్లంతైనట్లు సమాచారం రావడంతో ఆ తల్లిదండ్రులు ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. దీపావళి ముందురోజు జరిగిన ఈ సంఘటన ఖాజీపేట గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. గార పోలీసులు, మెరైన్ సీఐ ప్రసాదరావు తెలిపిన వివరాల మేరకు.. పొందూరు మండలం కింతలి పంచాయతీ ఖాజీపేటకు చెందిన



వివరాలు సేకరిస్తున్న మెరైన్ సీఐ ప్రసాదరావు

అలబోయిన గోవింద, గోపమ్మ కుమారుడు జగదీష్ (18) ఇంటర్మీడియట్ పూర్తి చేశాడు. ఆదివారం జగదీష్ పుట్టినరోజు కావడంతో వేడుకలు చేసుకోవడానికి మధ్యాహ్నం 2 గంటలకు తన ఐదుగురు స్నేహితులతో కలిసి గార మండలం మొగదలపాడు బీచ్‌కు వెళ్లాడు. సాయంత్రం 4 గంటల ప్రాంతంలో స్నానం కోసం సముద్రంలోకి దిగారు. అలల తాకిడికి జగదీష్ గల్లంతయ్యాడు. మిగిలిన నలుగురు మిత్రులు ప్రాణాలతో బయటపడ్డారు. స్నేహితులు కేకలు వేయడంతో సమీపంలో ఉన్నవారు, గ్రామస్థులు, మెరైన్ పోలీసులు వచ్చి రక్షించేందుకు ప్రయత్నించారు. అయినా ఫలితం లేకపోవడంతో స్నేహితులు జగదీష్ తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు ఒక్కసారిగా కుప్ప కూలిపోయారు. జగదీష్ తండ్రి గోవింద ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు గార ఏఎస్ఐ టి.చంద్రమోహన్ తెలిపారు.



గల్లంతైన జగదీష్

ఐబీఎం క్వాంటమ్ ఫెస్ట్‌కు సన్నద్ధం

- రేపటి నుంచి ఆర్జీయూకేటీ క్యాంపస్‌లో నిర్వహణ
- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు



ఆర్జీయూకేటీ, శ్రీకాకుళం క్యాంపస్

ఎచ్చెర్ల, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్‌లో ఐబీఎం క్వాంటమ్ క్విస్కిట్ పాల్ ఫెస్ట్-2025 మంగళవారం ప్రారంభంకానుంది. ఈ నెల 27వరకు ఈ ఫెస్ట్ జరగనుంది. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీకాకుళం క్యాంపస్‌కు చెందిన విద్యార్థులు కాటం నిఖిల్ తేజ, కాసిం వాలి దూదేకుల, ప్రవీణ్‌కుమార్ చెరుకూరి, జాన్‌బాబు చదువుల, గుణశ్రీ కిమిడి ఇచ్చిన ప్రజెంటేషన్‌ను అభినందించి ఐబీఎం క్వాంటమ్ ఈ ఫెస్ట్ నిర్వహణకు ఎంపిక చేసింది. ప్రపంచ వ్యాప్తంగా చాలా విద్యా సంస్థలు ఈ ఫెస్ట్ నిర్వహణ కోసం పోటీపడ్డాయి. ఇందులో కేవలం 55 విశ్వ విద్యాలయాలు (మిగతా 6వ పేజీలో..)



బాణసంచాతో బహుపరాక్

దీపావళి వేళ.. జాగ్రత్తలు తప్పనిసరి

నరసన్నపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి)

ఏటా ఆశ్వయుజ అమావాస్యరోజున దీపావళి పండుగను జరుపుకోవడం ఆనవాయితీ. చిన్నారుల నుంచి పెద్దల వరకు దీపాలు వెలిగిస్తూ.. బాణసంచా కాలుస్తూ ఎంతో ఆనందంగా జరుపుకునే పండుగ ఇది. ఈ పండగ ఎంత ఆనందాన్ని కలిగిస్తుందో.. జాగ్రత్తగా లేకుంటే అంతటి ప్రమాదాన్ని కూడా తెచ్చిపెడుతుంది. బాణసంచా విషయంలో ఎటువంటి ఎమరుపాటు ప్రదర్శించినా ప్రాణాలు సైతం కోల్పోయే ప్రమాదం ఉంది. ఆస్తి నష్టం కూడా భారీగానే జరుగుతుంది. బాణసంచా తయారీ నుంచి నిల్వ చేయడం, తరలించడం, విక్రయించడం, కాల్చడం వరకూ ప్రమాదాలకు ఆస్కారం ఎక్కువ. ఈనెల 8న అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామవరంలోని ఓ బాణసంచా తయారీ కేంద్రంలో భారీ విస్ఫోటనం జరిగి ఏడుగురు మృతి చెందిన విషయం తెలిసిందే. జిల్లాలో కూడా గతంలో ఇటువంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో దీపావళి వేళ.. తగు జాగ్రత్తలు తప్పనిసరి అని నిపుణులు చెబుతున్నారు.

ఈ జాగ్రత్తలు తీసుకోవాలి..

● నాణ్యమైన, బ్రాండెడ్ కంపెనీలకు చెందిన బాణసంచాను కొనుగోలు చేయాలి. ఈ ఏడాది తయారు చేసిన వాటిని మాత్రమే కొనుగోలు చేస్తే మంచిది. పిల్లలు బాణసంచా కాల్చేటప్పుడు పెద్దలు గమనిస్తూ ఉండాలి. కాటన్ వస్త్రాలు ధరించాలి. చేతులతో పట్టుకుని బాణసంచా కాల్చడం మంచిది కాదు. టపాసులు, రాకెట్ల విషయంలో చాలా జాగ్రత్త వహించాలి. కాకరపువ్వులు, మతాబులు, భూచక్రాలు, విష్ణుచక్రాలు కాలిన తరువాత వాటిని కాలితో తన్నడం మంచిది కాదు. వృద్ధులు, అనారోగ్యంగా ఉన్నవారి వద్ద బాణసంచా కాల్చరాదు. మతాబులు, బాంబులు మధ్యలో ఆరిపోతే వాటి దగ్గరకు వెళ్లి చూడడం, చేతులోకి తీసుకోవడం ప్రమాదకరం. ఇంటి లోపల బాణసంచా కాల్చరాదు.

ప్రమాదం సంభవిస్తే..

బాణసంచా కాల్చినప్పుడు అనుకోకుండా ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. అందుకే ప్రథమ చికిత్స కిట్‌తోపాటు నీటిని అందుబాటులో ఉంచుకోవాలి. శరీరం లేదా చేతులు కాలితే మంట తగ్గేవరకూ నీళ్లు పోస్తూ ఉండాలి. అగ్నిప్రమాదాల నివారణకు 100 నెంబర్‌కు లేదా ఆయా ప్రాంతాల్లో ఉన్న అగ్నిమాపక కేంద్రాలకు ఫోన్ చేయాలి. దీపావళి రోజున తమ సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉంటారని జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి మోహనరావు తెలిపారు. బాణసంచా కాల్చే సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

అగ్నిమాపక కేంద్రాల నెంబర్లు

శ్రీకాకుళం	08942 222099
నరసన్నపేట	08942 276777
పలాస	08945 241101
రణస్థలం	08942 234499
టెక్కలి	08945 244277
కోటబొమ్మాళి	08942 238659
ఇచ్ఛాపురం	08647 231101
ఆమదాలవలస	08942 286401
పొందూరు	08941 242101
కొత్తూరు	08946 258444
మందస	08947 237101
సోంపేట	08947 234101



గార మండలంలోని దీపావళి గ్రామం

ఆ ఊర్ల పేరే దీపావళి

● గార, టెక్కలి మండలాల్లో రెండు గ్రామాలు ఉన్నవైనం

గార/టెక్కలి రూరల్, అక్టోబరు 19: వెలుగుల పండగ దీపావళి పేరిట జిల్లాలో రెండు గ్రామాలు ఉన్నాయి. సుమారు 300 గృహాలు, వెయ్యి జనాభాతో గార మండలంలో దీపావళి అనే గ్రామం ఉండగా, సుమారు 50 కుటుంబాలతో టెక్కలి మండలం అయోధ్యపురం పంచాయతీలో దీపావళి (దీపాలపేట) అనే గ్రామం ఉంది. ● గారలోని దీపావళి గ్రామానికి ఆ పేరు పెట్టడంపై ఓ కథ ప్రాచుర్యంలో ఉంది. దశాబ్దాల కిందట సిక్కోలు రాజు గుర్రంపై కళింగపట్నంకు వెళ్తూ ఎండ తీవ్రతకు ఈ గ్రామం వద్ద స్పృహతప్పి పడిపోయారు. సమీపంలోని కూలీలు, భక్తులు వచ్చి రాజుకు సపర్యలు చేశారు. రాజు కోలుకున్న తర్వాత వారికి కృతజ్ఞతలు తెలిపారు. అదేరోజు దీపావళి పర్వదినం కావడంతో దాన్ని గుర్తుచేసుకున్న రాజు ఈ గ్రామానికి దీపావళిగా నామకరణం చేసినట్లు కథ ప్రచారంలో ఉంది. ఈ గ్రామస్థులు దీపావళిని పది రోజుల పాటు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ● టెక్కలిలోని దీపావళి గ్రామానికి ఆ పేరు ఎలా వచ్చిందంటే గ్రామస్థులు ఈ విధంగా చెబుతున్నారు. 1928-30 మధ్యలో గ్రామంలోని పూరిగుడిసెలు ఒకదానికి మరోకటి ఆనుకుని ఉండేవి. ఒకరోజు ఓ ఇంట్లోని దీపాన్ని ఎలుక తీసుకుని వెళ్లి గుడిసెపై వదిలేయడంతో గ్రామంలోని గుడిసెలన్నీ కాలిపోయాయి. అప్పటి నుంచి ఈ ఊరికి దీపాలపేట అని పిలిచేవారు. కాలక్రమేనా ఆ పేరుకాస్త దీపావళిగా మారినట్లు తమ పూర్వీకులు చెప్పేవారని గ్రామస్థులు చెబుతున్నారు.

కళ్లజోళ్లను ధరించి టపాసులు పేల్చాలి

● సీహెచ్‌సీ ఆప్తాలమిక్ అధికారి వసంతరావు



పొందూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి పురస్కరించుకుని కళ్లజోళ్లను ధరించి టపాసులు పేల్చాలని రాజాం సీహెచ్‌సీ ఆప్తాలమిక్ అధికారి ఎస్.వసంతరావు సూచించారు. ఇంటిల్లపాది ఆనందోత్సవాల మధ్య జరుపుకొనే దీపావళి పండగలో అనుకోని ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. ఈ ప్రమాదాల్లో బాధితులు ఎక్కువగా కంటి చూపును కోల్పోతున్నారని పేర్కొన్నారు. బాధితులు ఏమరుపాటుగా ఉంటే అంధులుగా మారే అవకాశముంటుందని తెలిపారు.

ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు..

● ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను పాటించి టపాసులు విక్రయించాలి. ● నాణ్యతతో కూడిన బ్రాండెండ్ కంపెనీ టపాసులనే వాడాలి. ● టపాసులు కాల్చే సమయంలో దూరం పాటించాలి. ● టపాసులు, పేలుడు పదార్థాలను చిన్నారులకు దూరంగా ఉంచాలి. ● టపాకులు కాల్చే సమయంలో విధిగా కాటన్‌వస్త్రాలను వాడాలి. సమీపంలో నీళ్ల బకెట్ ఉంచుకోవాలి. ● టపాసులను పిల్లలు పెద్దల సమక్షంలో కాల్చేలా చర్యలు తీసుకోవాలి. అలాగే చేతిలో పెట్టి కాల్చరాదు. ● కంటికి గాయాలైతే సొంతవైద్యం చేయకుండా వెంటనే కంటివైద్యులను సంప్రదించాలి. పొరపాటు చేస్తే కార్నియా దెబ్బతింటే అందులుగా మారొచ్చు.

సంతోషదాయకం..



హిందువులకు ఎంతో ముఖ్యమైన దీపావళి పండుగ పేరు మా గ్రామానికి ఉండడం ఎంతో సంతోషంగా ఉంది. ఇటువంటి గ్రామంలో జన్మించడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నాం. దీపావళిని గ్రామస్థులమంతా కలిపి ఆనందంగా జరుపుకొంటాం.

-శ్రీరంగ మధుసూదనస్వామి, దీపావళి, గార

మా ఊరంటే ఎంతో ఇష్టంజ..



దీపావళి పండుగ పేరు మా గ్రామానికి ఉండడం సంతోషంగా ఉంది. అందుకే మా ఊరు అంటే నాకు ఎంతో ఇష్టం. ఏటా దీపావళిని ఘనంగా జరుపుతాం.

-చల్ల శ్రీనివాసరావు, సర్పంచ్ దీపావళి, గార



టెక్కలి మండలంలోని దీపావళి గ్రామం

అంతర్గత భద్రతలో.. అలుపెరగని పోరాటం

● అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివి

● రేపు పోలీసు అమరవీరుల దినోత్సవం

శ్రీకాకుళం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దేశ సరిహద్దు రక్షణ, అంతర్గత భద్రతే లక్ష్యంగా పోలీసులు విధులు నిర్వహిస్తున్నారు. విధి నిర్వహణలో ఎటువంటి ఒడిదుడుకులు ఎదురైనా ముందుకువెళ్తున్నారు. సరిహద్దులో శత్రువులతో జరిగే పోరులో వందలాది మంది ప్రాణాలొదిలిన విషయం విదితమే. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోనూ పోలీసుల బలగాలు ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్నాయి. ఈక్రమంలో ఎందరో అమరులయ్యారు. వారి పోరాట పటిమ దేశ పౌరులందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. వారి త్యాగాలు వెలకట్టలేనివి.1959 అక్టోబరు 21న హిమాలయాల్లోని ఆక్సాహిచిన్ ప్రాంతంలో గస్తీ తిరుగుతున్న పదిమంది సీఆర్‌పీఎఫ్ జవాన్లను శత్రుదేశం హతమార్చింది. అప్పటి నుంచి దేశభద్రతకు ప్రాణత్యాగం చేసిన అమరవీరులను త్యాగాలు స్మరించుకుంటూ ఏటా అక్టోబరు 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినం నిర్వహిస్తున్నారు. శ్రీకాకుళం జిల్లాలో నక్సల్స్‌తో పోరులో ఐదుగురు వీరమరణం పొందారు.

మావోయిస్టులను పట్టుకునేందుకు వెళ్లి..



విజయనగరం జిల్లా డెంకాడ మండలంలోని గునపురంపేట గ్రామానికి చెందిన ఎస్. బంగారునాయుడు 1989 జనవరి 16న పోలీసు శాఖలో ఎస్ఐగా విధుల్లో చేరారు. శ్రీకాకుళం జిల్లాలో పలు మండలాల్లో ఎస్ఐగా పనిచేశారు. కాశీబుగ్గ ఎస్‌హెచ్‌వో పనిచేస్తున్న సమయంలో 1992 మార్చి 24న మందస మండలం లోని బేతాళపురంలో మావోయిస్టులు ఉన్నారని సమా చారం అందింది. స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ జగన్మోహన రావుతోపాటు ఆర్మ్‌డ్ రిజర్వు సిబ్బందితో కలిసి రైడ్‌కు వెళ్లారు. కొంతమందిని పట్టుకుని తిరిగి వస్తున్న సమ యంలో రట్టికొండ వద్ద నాగావళి దళం కాల్పులు జరి పింది. ఈ ఘటనలో ఎస్ఐ బంగారునాయుడు వీరోచి తంగా పోరాడి వీరమరణం పొందారు.

నక్సలైట్ల సమాచార సేకరణలో దిట్ట..



టెక్కలి ప్రాంతానికి చెందిన ఎం.నరేంద్రదాస్ 1976 ఫిబ్రవరి 13న పోలీసు శాఖలో కానిస్టేబుల్‌గా విధుల్లో చేరారు. జిల్లాలో పలు ప్రాంతాల్లో పనిచేశారు. నక్సలైట్ల సమాచారాన్ని సేకరించే విషయంలో దిట్టగా నరేంద్రదాస్ పేరుగాంచారు. వారి ఉద్యమాలను నీరుగార్చేందుకు విశేష కృషిచేయడంతో హెడ్ కానిస్టేబుల్‌గా ఉన్న నరేంద్రదాస్‌పై నక్సల్స్ గురి పెట్టారు. 1997 మార్చి 17న కాశీబుగ్గ స్టేషన్‌కు వెళ్లేముందు దారిలో దైవదర్శనానికి వెళ్లిన దాస్‌పై ఆరుగురు నక్సలైట్లు కాల్పులు జరిపారు. ఆ ఘటనలో నరేంద్రదాస్ వీరమరణం పొందారు.

దాడిని తిప్పి కొట్టి అమరుడై...



కోటబొమ్మాళి మండలంలోని జర్జంగి గ్రామానికి చెందిన హెడ్‌కానిస్టేబుల్ ఎ.పాపారావు 1971లో పోలీసు శాఖలో చేరారు. వజ్రపుకొత్తూరు స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సమయంలో పలాస మండలంలోని నీలిభద్రలో కంబిరిగాం చౌదరి అనే వ్యక్తిని హతమార్చి.. ఆయన ఆస్తిని దోచుకునేందుకు నక్సలైట్ ప్రణాళిక వేశారని పోలీసులకు సమాచారం అందింది. ఈ విషయం తెలుసుకున్న పోలీసు శాఖ కంబిరిగాం చౌదరిని రక్షించేందుకు ఆయన ఇంటిఎదుట రక్షణగా నలుగురు పోలీసులతో పికెట్‌ను ఏర్పాటుచేశారు. ఇందులో హెడ్‌కానిస్టేబుల్ పాపారావు కూడా ఉన్నారు. 1997 జూలై 17న అర్ధరాత్రి తుపాకులతో నక్సలైట్లు విరుచుకుపడ్డారు. దాడిని తిప్పికొట్టే సమయంలో పాపారావు నక్సల్స్ తూటాలకు బలై నేలకొరిగారు.

నక్సలైట్‌ల ఏరివేతలో చురుకైన పాత్ర పోషిస్తూ..



సంతకవిటి మండలంలోని వాల్తేరు గ్రామానికి చెందిన పి.కృష్ణమూర్తి కానిస్టేబుల్‌గా 1988లో విధుల్లో చేరారు. కృష్ణమూర్తి నక్సలైట్ల కార్యకలాపాల సమాచార సేకరణలో ఆరితేరిన వ్యక్తిగా పోలీసు శాఖలో ముద్రపడ్డారు. నక్సలైట్ ఏరివేతలో చురుకైన పాత్ర పోషిస్తూ శాంతి భద్రతలను పరిరక్షించేవాడు.ఈ విషయం తెలుసుకున్న నక్సల్స్ కృష్ణమూర్తిని మట్టుబెట్టాలని పథకం పన్నారు. 2000 జూన్ 5న పీపుల్‌వార్ గ్రూప్ నక్సలైట్లు హరిపు రం జంక్షన్ వద్ద మాటువేశారు. అటుగా వస్తున్న కాని స్టేబుళ్లు కె.రమేష్, పి.కృష్ణమూర్తిలపై నక్సల్స్ దాడులకు పాల్పడ్డారు. ఈ ఘటనలో పి.కృష్ణమూర్తి నక్సలైట్ల తూటాలకు నేలకొరిగారు.

మందుపాతరకు బలై..



పొందూరు మండలంలోని లోలుగు గ్రామానికి చెందిన మజ్జి వెంకటరమణ 1998లో పోలీసు కానిస్టేబుల్‌గా విధుల్లో చేరారు. అనంతరం జిల్లా స్పెషల్ టాస్క్‌ఫోర్సులో సేవలందించి ఉన్నతాధికారుల మన్ననలు పొందాడు. 2001 అక్టోబర్ 27న నులకజోడు వద్ద మవోయిస్టులు సంచరిస్తున్నారని సమాచారం పోలీసు శాఖకు అందింది. దీంతో 27 మంది స్పెషల్ టాస్క్ ఫోర్సు సిబ్బంది నులకజోడు గ్రామానికి చేరుకున్నారు. ఆ ప్రాంతంలో ముందుగానే నక్సల్స్ ఐదు మందుపాతరలను అమర్చారు. వాటిని పేల్చివేసి పోలీసులపై ఒక్కసారిగా 16 మంది నక్సలైట్లు కాల్పులకు పాల్పడ్డారు. వీరోచితంగా పోరాడి వెంకటరమణ అక్కడికక్కడే వీరమరణం పొందారు.

బీలకు మహర్దశ

(ఐదో పేజీ తరువాయి)

నిర్ణయంతో ఈప్రాంతానికి ఎంతగానో మేలు జరగనుంది. చిత్తడి నేలల పరిరక్షణతో పాటు పర్యాటక రంగం అభివృద్ధికి కూడా అవకాశాలు మెండుగా ఉంటాయి. పెద్దమొత్తంలో నిధులు వెచ్చింది ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసే ఆస్కారం ఉంటుంది.

బీల ఎంతో ప్రత్యేకం..

2011లో ఆరు నెలలపాటు కేంద్ర బృందం సభ్యులు బీలలో పర్యటించి కేంద్ర ప్రభుత్వానికి నివేదికను అందజేశారు. వారి నివేదిక ప్రకారం.. 'బీల మూడు రకాలు. చిన్నబీల, పెద్దబీల, తంపరగా ఉన్నాయి. పెద్దబీల మిగతా రెండింటితో అనుసంధానంగా ఉంటుంది. తంపర సముద్రానికి దగ్గరా ఉంటుంది. సోంపేట మండలం బారువ నుంచి కవిటి మండలం కపాసుకుద్ది వరకు తీరం వెంబడి మొత్తంగా 20 కిలోమీటర్ల పొడవు ఉండే ఈ చిత్తడి నేలలు దాదాపు 4వేల ఎకరాల్లో విస్తరించి ఉన్నాయి. బీలలో 493 రకాల మొక్కలు, చెట్లు, 149రకాల పక్షులు ఉన్నాయి. జిల్లాలోనే 74శాతం వృక్షజాతులు, 52 శాతం పక్షులు ఈ ప్రాంతం కలిగి ఉంది. అంతరించిపోతున్న జాబితాలో ఉన్న కామన్‌పోచర్డ్ అనే పక్షిని 2016 డిసెంబరు 15న కవిటి బీల ప్రాంతంలో గుర్తించారు. 10 శాతం చిత్తడినేలల్లో 1500వరకు నీటి పక్షులు కనిపించాయి. శీతాకాలంలో 20వేలకు పైగా నీటిపక్షులు ఉంటాయి. పొలాల గట్లపై 46రకాల సీతాకోక చిలుకలు, 24రకాల తుమ్మెదలను గుర్తించారు.' ఇలా బీల ప్రాంతంలో వైవిధ్యమైన చెట్లు, మొక్కలు, పక్షులను గుర్తించినట్లు కేంద్ర ప్రభుత్వానికి అందజేసిన నివేదికలో పొందుపరిచారు.

రూ.10 కోట్లతో శ్రీకూర్మక్షేత్రం అభివృద్ధి

(ఐదో పేజీ తరువాయి)

సహకారంతో చర్యలు తీసుకుంటాం. సీఎస్ఆర్ కార్యకలాపాల్లో భాగంగా ఇండిగో సంస్థ రూ.10 కోట్ల వ్యయంతో ఈ క్షేత్రాన్ని అభివృద్ధి చేసేందుకు ముందుకు వచ్చింది. ఇందులో భాగంగా తొలుత శ్వేత పుష్కరిణి అభివృద్ధి పరిచేందుకు అవసరమైన డిజైన్ రూపొందిస్తాం. వసతి సౌకర్యాలు, నిత్యాన్నదాన పథకం మరింత విస్తరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. పర్యాటకంగా కూడా మరింత అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతో ఆసక్తితో ఉన్నారు.' అని తెలిపారు. వీరికి ఆలయ అధికారి కె.నరసింహనాయుడు, ప్రధాన అర్చకులు సీతారామ నరసింహచార్యులు స్వామి వారి ప్రసాదం, చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు బోర్డు సభ్యులు కైబాడి కుసుమకుమారి, అరవెల్లి శ్వేతబిందు, అంధవరపు మౌనిక, గొండు శ్రీనివాసరావు, జమ్ము లక్ష్మి, కూటమి నాయకులు మెండ దాసునాయుడు, అరవల రవీంద్ర, బడగల వెంకట అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ఐబీఎం క్వాంటమ్ ఫెస్ట్‌కు సన్నద్ధం

(ఐదో పేజీ తరువాయి)

మాత్రమే ఎంపికయ్యాయి. రాష్ట్రం నుంచి ఏకైక సంస్థగా ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్ ఎంపిక కావడం విశేషం. ఈ ఫెస్ట్ రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ) పరిధిలోని శ్రీకాకుళం, నూజివీడు, ఒంగోలు, ఆర్‌కే వ్యాలీ (ఇడుపుల పాయ)లోని నాలుగు క్యాంపస్‌ల్లో జరగనుంది.

తొలి రోజు..

ఐబీఎం క్వాంటమ్ ఇండియన్ లీడ్ ఎల్.వెంకట సుబ్రమణ్యం హాజరవుతారు. రెండు రోజుల పాటు హ్యాకథాన్ నిర్వహిస్తారు. విద్యార్థులు, పరిశోధకులు, సాంకేతిక నిపుణులు ప్రత్యక్షంగా, ఆన్‌లైన్ ద్వారా పాల్గొంటారు. ఈ రంగంలోని ఉపాధి అవకాశాలపై వర్క్‌షాపులు, నిపుణుల ఉపన్యాసాలు, క్వాంటం సాంకేతికాభివృద్ధిపై చర్చ ఉంటుంది. క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ ఆధ్వర్యంలో ఏవో డాక్టర్ ముని రామకృష్ణ తదితరులు పర్యవేక్షిస్తున్నారు. ఈ ఫెస్ట్‌కు కన్వీనర్‌గా అకడమిక్స్ డీన్ డాక్టర్ శివరామకృష్ణ వ్యవహరిస్తున్నారు.

ఏర్పాట్లు చేస్తున్నాం..



క్వాంటం ఫెస్ట్‌ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నాం. ఈ నెల 21 నుంచి 27వరకు ఈ ఫెస్ట్ జరగ నుంది. ఇందుకోసం ఏర్పాట్లు చేస్తు న్నాం. ఈ ఫెస్ట్‌తో విద్యార్థులు మరిం త సృజనాత్మకంగా, సాంకేతికంగా ఆలోచించే అవకాశం ఉంది.

-డాక్టర్ కేవీజీడీ బాలాజీ, డైరెక్టర్, ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్

రేపటి నుంచి పోలీసు అమరవీరుల వారోత్సవాలు

శ్రీకాకుళం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించేందుకు అమరవీరుల వారోత్సవాలు మంగళవారం ప్రారంభంకానున్నాయని ఎస్పీ మహేశ్వరరెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. విధి నిర్వహణలో అమరులైన పోలీసులు సేవలు, త్యాగాలను కొనియాడుతూ స్మారకోత్సవాలను నిర్వహించేందుకు జిల్లా పోలీసు శాఖ సిద్ధమయ్యిందని పేర్కొన్నారు. మంగళవారం నుంచి ఈనెల 31వరకు జిల్లావ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో స్మారకోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. విధి నిర్వహణలో అసువులు బాసిన అమర వీరుల సేవలను గుర్తుచేసుకోవడంతోపాటు సమాజంలో పోలీసుల పాత్ర, విధులు, త్యాగాలు గురించి ప్రజల్లో అవగాహన తీసుకువచ్చే ఉద్దేశంగా స్మారకోత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలు..

● స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో అక్టోబరు 21న అమరవీరుల సంస్మరణ దినం పురస్కరించుకుని ఆ రోజు ఉదయం పోలీసు అమరవీరుల స్థూపం వద్ద ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో సంస్మరణ దినోత్సవం నిర్వహిస్తారు. మావోయిస్టులు, ఉగ్రవాదులు, అసాంఘిక శక్తులతో పోరాటంలో భాగంగా విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసు సిబ్బందిని స్మరించుకుని నివాళులర్పిస్తారు. స్మృతి పరేడ్ నిర్వహించి అమరులకు శ్రద్ధాంజలి ఘటిస్తారు.

● శ్రీకాకుళంలోని ఎస్పీ కార్యాలయం ఆవరణలో 21న ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహిస్తారు. పోలీసుల ఆయుధాలు, పరికరాలు, సాధనాలు, అధునాతన టెక్నాలజీతో కూడిన ఉపకరణాలను ప్రదర్శిస్తారు. వీటి గురించి సందర్శకులు, విద్యార్థులకు వివరిస్తారు. ఈనెల 22 నుంచి 31 వరకు ఎచ్చెర్లలో పోలీసు కల్యాణ మండపంలో కూడా ఓపెన్‌హౌస్ నిర్వహిస్తారు. ప్రజలు, విద్యార్థులకు అవగాహన కల్పిస్తారు. జిల్లాలోని అన్ని స్టేషన్లలో ఓపెన్ హౌస్ నిర్వహించేందుకు ఏర్పాట్లుచేశారు.

● జిల్లాలోని పోలీసు అమరవీరుల గ్రామాలను ఈనెల 22 నుంచి 30 వరకు పోలీసు అధికారులు సందర్శిస్తారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి అమరులైన పోలీసు సిబ్బంది త్యాగాలను స్మరిస్తూ జ్ఞాపికలను అందజేస్తారు. పోలీసుల అమరవీరుల చేసిన గొప్ప పనులను వివరించి వారి ఫోటోలకు నివాళులర్పిస్తారు.

● జిల్లాలో అన్ని సబ్ డివిజన్ల పరిధిలో ఈనెల 24 నుంచి 27 వరకు విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులను అందజేస్తారు. దేశభక్తిని తెలిపే సందేశాత్మక చిత్రాలను ఈనెల 30 వరకు ఓపెన్ థియేటర్‌లో సమాజ భద్రత కోసం అసాంఘిక శక్తులను అణిచివేస్తూ త్యాగం, పరాక్రమాలు కనబరిచే పోలీసుల దేశభక్తిని వివరించే చిత్రాలను ప్రదర్శిస్తారు. పోలీసు బ్యాండ్ షోలు, పోలీసు వాయిద్య బృందాల ప్రదర్శనలు నిర్వహిస్తారు. 30న పోలీసు అమరవీరుల కుటుంబాల్లోని ప్రత్యేక విజయాలు సాధించిన వారికి సన్మానించి, వారి సేవలను ప్రశంసిస్తారు. 31న రాష్ట్రీయ ఏక్తా దివస్ కార్యక్రమం సందర్భంగా యూనిట్ రన్, సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తారు.

కుండపోత వర్షం



వజ్రపుకొత్తూరు: పూండి కూడలిలో రోడ్డుపై చేరిన వర్షం నీరు

వజ్రపుకొత్తూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం మధ్యాహ్నం కురిసిన కుండపోత వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. దీంతో రాకపోకలకు ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. పూండి, బెండిగేటు పరిసరాల్లో సుమారు రెండు గంటల పాటు వర్షం కురిసింది. దీంతో రోడ్లపై వర్షం నీరు నలిచిపోయింది. బెండిగేటు వద్ద రోడ్లపై నిలిచిన వర్షానికి నీరు చేరడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఏటా వర్షాలకు బెండిగేటు వద్ద ఇదే పరిస్థితి నెలకొంటుంది. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం లేదని స్థానికులు చెబుతున్నారు.

పలాస జంట పట్టణాల్లో..

పలాస, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో రెండురోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. అల్పపీడనం కారణంగా శనివారం రాత్రి 7 గంటల నుంచి 9.30 గంటల వరకూ వర్షం కురవగా.. ఆదివారం సాయంత్రం 3 గంటల నుంచి భారీగా వర్షం కురిసింది. దీనితో లోతట్టు ప్రాంతాలన్నీ నీటి మునిగాయి. కేటీ రోడ్డు మొత్తం నీటితో నిండిపోగా ప్రజలు ఇబ్బందిపడ్డారు. వివేకానంద్‌మార్గ్‌లో ఉన్న ఓ దాబాలోకి నీరు చొచ్చుకుపోయింది. అడుగు మేర నీరు నిలిచిపోయింది. దీంతో ఆ నీటిలోనే వినియోగదారులు అల్పాహారం తిన్నారు. కొద్ది రోజుల కిందట ఏకధాటిగా 11 గంటల పాటు వర్షం కురవడంతో మొత్తం అంతా జలమయం కాగా.. నిండా నీటితో ప్రజలు బయటకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడిన విషయం విధితమే. అయితే శనివారం రాత్రి రెండున్నర గంటల పాటు కురిసిన వర్షానికి అదే పరిస్థితి నెలకొంది. ఆదివారం సాయంత్రం కూడా భారీ వర్షాలు కురుస్తుండడంతో ప్రజలు ఇబ్బందిపడ్డారు. దీపావళి సామగ్రి కొనుగోలు చేసేందుకు ప్రజలు ఇబ్బందిపడ్డారు.



పలాస: వివేకానంద్‌మార్గ్‌లోని ఓ దాబాలో చేరిన నీరు

న్యూస్ బాక్స్

రక్తదానం చేసి.. ప్రాణాలు కాపాడి

ఇచ్ఛాపురం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన ఆర్.జగన్నాథం(74) అధిక రక్తస్రావంతో బాధపడుతున్నాడు. రక్తం అవసరమని కుటుంబ సభ్యులు జనసేన నేత రోకళ్ల భాస్కర్ దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే ఆయన సూచనలతో ఆదివారం జనసైనికుడు చీకటి కృష్ణయ్య ఉద్దానం బ్లడ్‌బ్యాంక్‌లో రక్తదానం చేసి వృద్ధుడి ప్రాణాలను కాపాడారు. దీంతో కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

భవన నిర్మాణానికి స్థలం కేటాయించండి

సోంపేట రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బలిజ సంక్షేమం సంఘం భవనం నిర్మాణానికి స్థలం మంజూరు చేయాలని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును ఎర్రముక్కాం వాడ బలిజ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాయితి హరికృష్ణ తదితరులు కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయనను కలిసి వినతిపత్రం అందించారు. గ్రామానికి చెందిన 200 కుటుంబాలు విశాఖలో నివాసం ఉంటున్నాయని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ఆదిత్యుని ఆదాయం రూ.3.50 లక్షలు

అరసవల్లి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారికి ఆదివారం రూ.3,50,721 ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్ల ద్వారా రూ.79,500, విరాళాలు రూ.1,23,446, ప్రసాదాల ద్వారా రూ.1,38,275 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. వందలాది మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

● స్వామివారి అనివెట్టి మండపంలో ఆదివారం శివ పంచాయతన సహిత మహా లింగార్చన నిర్వహించారు. ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకర శర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఇప్పిలి సాందీపశర్మ లింగార్చన చేశారు. కార్యక్రమంలో పండితులు దర్భముళ్ల శ్రీనివాస శర్మ, ఆర్.వికాస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.



ఈవో ప్రసాద్‌కు వెండి బిందెలను అందజేస్తున్న దాతలు

వెండి బిందెలు అందజేత

సూర్యనారాయణ స్వామికి ఫిరంగిపురం, బూర్జ గ్రామాలకు చెందిన కేశవరావు, ఉమా మహేశ్వరరావు, వెంకట స్వామి ఆదివారం కేజీ 888 గ్రాముల మూడు వెండి బిందెల ను ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్, ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకరశర్మలకు అందించారు. దాతలను అర్చకులు ఆశీర్వదించగా... స్వామి ప్రసాదాలను ఈవో అందించారు.

మల్లన్న సన్నిధిలో నృత్య ప్రదర్శన

పొందూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీశైలం మల్లన్న సన్నిధిలో లత్సయ్యపేటకు చెందిన విద్యార్థిని సనపల స్నేహాంజలి నృత్య ప్రదర్శన చేశారు. శ్రీశైల మల్లి కార్జున స్వామి దేవస్థానం అధికారుల ఆహ్వానం మేరకు శనివారం రాత్రి సాంస్కృతిక వేదికపై చేసిన భరత నాట్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆమెను దేవాలయ అధికారులు, పాలకమండలి సభ్యులు సత్కరించి అభినందించారు.



నృత్యాభినయం చేస్తున్న స్నేహాంజలి

జిల్లాస్థాయి క్రికెట్ విజేతకు ట్రోఫీ

ఇచ్ఛాపురం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీలో పురుషోత్తపురం ఏపీ మోడల్ స్కూల్ జట్టు విజయం సాధించింది. ఫైనల్ మ్యాచ్‌లో పురుషోత్తపురం జట్టు-శ్రీ చైతన్య బ్రాంచ్ 1 జట్లు తలపడ్డాయి. ఆదివారం సురిగిరాజా మైదానంలో విజేతలకు ట్రోఫీ అందించారు. కార్యక్రమంలో ఐసీసీ క్రికెట్ క్లబ్ అధ్యక్షుడు దాసరి రాజు, సీనియర్ క్రీడాకారులు బత్తుల వెంకట రమణ, ఎల్.నరసింహమూర్తి, సీహెచ్ లోహిదాస్ తదితరులు పాల్గొన్నారు.

డైవర్షన్ కోసమే తెరపైకి గూగుల్ సెంటర్

శ్రీకాకుళం అర్బన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కల్తీ మద్యం, మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ అంశాలపై ప్రజల్లో తీవ్ర చర్చ జరుగుతోందని, ఈ సమయంలో ప్రజలను డైవర్ట్ చేసేందుకే ప్రభుత్వం విశాఖకు గూగుల్ డేటా సెంటర్ ప్రకటనలు చేస్తోందని మాజీ మంత్రి, వైసీపీ నేత సీదిరి అప్పలరాజు విమర్శించారు. ఆదివారం పాత్రునివలస పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. మాజీ సీఎం జగన్ హయాంలో ప్రారంభమైన ఐదు మెడికల్ కాలేజీలకు ఇప్పుడు ఎన్ఎంసీ పీజీ సీట్లు కేటాయించిందని, కనీసం వైసీపీ హయాంలో ప్రారంభించకపోతే పీజీ సీట్లు ఎలా మంజూరు చేస్తారని ప్రశ్నించారు. గూగుల్ డేటా సెంటర్ ద్వారా రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదన్నారు.

ఆలోచింపజేసిన అజ్ఞాతవాసం నాటిక

ఆమదాలవలస, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నందన్న ఉత్సవాల ముగింపు సందర్భంగా పట్టణం లోని నాలుగో వార్డు గేదెలవానిపేటలో శనివారం రాత్రి ప్రదర్శించిన అజ్ఞాతవాసం నాటిక ప్రేక్షకులను ఆలోచింపజేసింది. అహంకారం, ధన దర్పం కారణంగా భర్తకు విలువ ఇవ్వని ఒక స్త్రీ జీవితాన్ని ఇతివృత్తంగా చేసుకొని కుప్పిలి వెంకట రాజారావు ఈ నాటికను రచించారు.

రూ.1.09 లక్షల బాణసంచా స్వాధీనం

పొందూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా మందుగుండు సామగ్రిని విక్రయిస్తున్న మండల కేంద్రానికి చెందిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు. తమకు వచ్చిన సమాచారం మేరకు అక్రమంగా విక్రయిస్తున్న రూ.1,09,623 విలువ చేసే బాణసంచా సామగ్రిని స్వాధీనం చేసుకుని పి.వెంకటరావు, జె.మణికంఠ, జి.రవిపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు.

తీరంలో వ్యర్థాల తొలగింపు



సేకరించిన వ్యర్థాలతో యువకులు

సోంపేట రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రముక్కాం సముద్రతీరంలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను గ్రామస్థులు ఆదివారం తొలగించారు. తుఫాన్ కారణంగా కెరటాలతో ఒడ్డుకు కొట్టుకొచ్చిన వ్యర్థాలను కిలోమీటర్ల మేర తొలగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు అంబటి రాజారావు, చంద్రమోహన్, సూరాడ రాజ్‌కుమార్, పొట్టి మేఘునాథం, పాపారావు బడ్డి, కూర్మారావు రట్టి, డిల్లీశ్వరరావు, మురళీ, పలువురు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

చేనేత సమస్యలు పరిష్కరించాలి

గార, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరినట్లు జిల్లా చేనేత సహకార సంఘాల నాయకులు కాసిన ప్రసాదరావు, మంచు కృష్ణారావు తదితరులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆదివారం శ్రీకూర్మం వచ్చిన కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడును కలిసి వినతి పత్రం అందించామన్నారు. ఆప్కో ఎమ్‌డీగా ఫుల్ టైం అధికారిని నియమించాలని, త్రిఫ్ట్ ఫండ్ మ్యాచింగ్ గ్రాంట్ విడుదల చేయాలని, ఆప్కో నుంచి సంఘాలకు రావాల్సిన బకాయిలు విడుదల చేయాలని కోరామన్నారు. సంఘాల వద్ద ఉన్న వస్త్రాలను కొనుగోలు చేసి పరిశ్రమ అభివృద్ధికి సహకరించాలని కేంద్రమంత్రిని కోరామన్నారు.

క్రైం కార్నర్

గుర్తుతెలియని వ్యక్తి మృతి



మృతదేహం

కంచిలి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): బూరగాం జాతీయ రహదారి సమీపంలో మతిస్థిమితం లేని ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి రెండు రోజులు కిందటే మృతి చెందినట్లు ఎస్ఐ పారినాయుడు ఆదివారం తెలిపారు. మృతుడి వయసు సుమారు 45 సంవత్సరాలుంటుందని, నలుపు ప్యాంట్, ఎరు పు కలర్ టీ షర్ట్ ధరించి ఉన్నాడన్నారు. మృతుడి వివరాలు తెలిస్తే 63099 90866, 63099 90819 నెంబర్లలో సమాచారం ఇవ్వాలన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు..

లావేరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బెజ్జిపురానికి చెందిన గురిజాపు అప్పలనాయుడు (69) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు హెచ్‌సీ విద్యానంద్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. అప్పలనాయుడుకు మద్యం సేవించే అలవాటు ఉంది. ఈనెల 10న ఫూటుగా మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. దీంతో అతడిని కుటుంబసభ్యులు మందలించారు. దీనిని తట్టుకోలేక మనస్తాపం చెంది వ్యవసాయ పనుల కోసం తెచ్చి ఉంచిన పురుగుల మందును ఇంటివద్దే సేవించాడు. దీనిని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే 108 లో శ్రీకాకుళం రిమ్స్‌కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కుమారుడు దుర్గారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య

కంచిలి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కర్తలి గ్రామానికి చెందిన బోర జోగమ్మ(73) ఇంట్లో ఉరి పోసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. జోగమ్మకు ఇద్దరు కుమారులున్నారు. పెద్ద కుమారుడు శ్యామలరావు మస్కట్‌లో, రెండో కుమారుడు భాస్కరరావు దుబాయ్‌లో పనిచేస్తున్నారు. పెద్దకొడుకు కుటుంబం విశాఖలో, రెండో కొడుకు కుటుంబం కర్తలిలో ఉంటున్నారు. అయితే 3 నెలల చొప్పున ఒక్కో కుమారుడు వద్ద తల్లి జోగమ్మ ఉంటోంది. విశాఖలోని పెద్ద కుమారుడి ఇంటి నుంచి 50 రోజుల కిందట కర్తలిలో ఉంటున్న చిన్న కుమారుడి ఇంటికి వచ్చింది. చిన్నకోడలు సరస్వతితో గొడవ పడింది. తీవ్ర మనస్తాపానికి గురైన జోగమ్మ శనివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడింది. ఆదివారం ఉదయం 8 గంటల సమయంలో స్నానానికి వేడినీరు పెట్టి అత్త ఉంటున్న గదికి తీసుకెళ్లేసరికి ఇంట్లో దూలానికి ఉరి వేసుకొని ఉన్నట్లు గుర్తించి స్థానికులకు సమాచారం ఇచ్చింది. మృతురాలి చెల్లెలు ఆబోతు తులసమ్మ ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పారినాయుడు తెలిపారు.

సీఆర్‌పీఎఫ్ ఎస్ఐ సతీమణి అనుమానాస్పద మృతి

శ్రీకాకుళం రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): సీఆర్‌పీఎఫ్‌లో ఎస్ఐగా పనిచేస్తున్న లోల్ల చిరంజీవులు సతీమణి నిర్మల అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. శ్రీకాకుళం రూరల్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. చిరంజీవులు సింగుపురం పంచాయతీ అంపోలు జంక్షన్‌లో గౌతమినగర్ కాలనీలో కుటుంబంతో కలిసి నివసిస్తున్నారు. ఈయన చత్తీస్‌గఢ్ రాష్ట్రంలో సీఆర్‌పీఎఫ్ ఎస్ఐగా పనిచేస్తున్నారు. సతీమణి నిర్మల ఒక్కరే గౌతమినగర్‌లో ఉంటోంది. వీరికి ఇద్దరు పిల్లలు కాగా కుమారుడు బెంగుళూరులో సాఫ్ట్‌వేర్‌గా పనిచేస్తున్నాడు. కుమార్తె ప్రేమ వివాహం. కుమారుడు శనివారం రాత్రి నుంచి ఫోన్ చేసిన తల్లి ఫోన్ తీయకపోవడంతో సందేహం వచ్చి తన బావకి తెలిపాడు. బావ అతని స్నేహితుడిని పంపారు. అతడు వచ్చి కిటికీ నుంచి చూసేసరికి నిర్మల ఇంటిలో కింద పడిపోయి మృతి చెంది ఉంది. వెంటనే విషయాన్ని స్థానికులకు తెలుపగా అక్కడికి బంధువులు ఆదివారం ఉదయం వచ్చి తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లారు. ఆమె మృతిచెందిన విషయాన్ని భర్త చిరంజీవులుకు తెలియజేయగా ఆయన హుటాహుటిన బయలుదేరి వచ్చారు. చిరంజీవులు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రామకౌండన్యకు వ్రింద్రాని పురస్కారం



వ్రింద్రాని పురస్కారాన్ని అందుకుంటున్న రామకౌండన్య


గుజరాతీపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నాట్య రంగంలో విశేష కృషి చేసిన రామకౌండన్యకు వ్రింద్రాని-2025 పురస్కారం లభించింది. చెన్నైలోని ద లాస్య ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతి ఏటా నృత్య రంగంలో విశేష ప్రతిభ పాటవాలు ప్రదర్శించిన కళాకారులకు ఈ పురస్కారం అందిస్తుంది. ఇందులో భాగంగా ఈ ఏడాది నృత్య దర్శకుడు రఘుపాత్రుని శ్రీకాంత్ శిష్యుడు రామ కౌండన్యకు సంస్థ అధినేత రాజ్ ఆదివారం రాత్రి చెన్నైలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు కళాకారులు, స్నేహితులు, అభిమానులు తదితరులు అభినందించారు.



జ్ఞాపిక అందుకుంటున్న శ్రీహర్షిత

కూచిపూడి రీల్ పోటీల్లో శ్రీహర్షిత ప్రతిభ

ప్రపంచ కూచిపూడి దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడ సమీపంలోని కూచిపూడి గ్రామంలో సిద్ధేంద్ర యోగి కళాపీఠంలో జరిగిన కూచిపూడి రీల్ పోటీల్లో కుంబారు సింధు శ్రీహర్షిత ప్రతిభ కనబరిచింది. నగరంలోని అభినయ నృత్య నికేతన్ విద్యార్థి అయిన శ్రీహర్షితకు శనివారం కళాపీఠం ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు కళాకారులు, స్నేహితులు అభినందించారు.



































ప్రైవేటు గోడౌన్‌గా ప్రభుత్వ భవనం

● నోటీసులిచ్చినా పట్టించుకోని ఆక్రమణదారు


అసంపూర్తి భవనంలో ధాన్యం బస్తాలు, గడ్డి ఉంచిన దృశ్యం

సరుబుజ్జిలి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మతలబుపేట గ్రామంలో రూ.లక్షలతో నిర్మాణం చేపట్టి అర్ధం తరంగా నిలిపివేసిన ఓ ప్రభుత్వ భవనాన్ని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన వ్యక్తిగత అవసరాల కోసం గోడౌన్‌గా వినియోగిస్తున్నాడు. అయినా అధికారులు పట్టించుకోకపోవడం పై విమర్శలు వినిపిస్తున్నాయి. వివరాలిలా ఉన్నాయి.. వైసీపీ ప్రభుత్వంలో మతలబుపేట గ్రామంలో సచివాలయంతో పాటు ఆరోగ్య ఉపకేంద్రం భవనాలను మంజూరు చేసింది. సచివాలయ నిర్మాణం పూర్తి చేసినా హెల్త్ సెంటర్ పనులను అర్ధంతరంగా నిలిపివేశారు. దీనిని ఓ వ్యక్తిగత ఏడాదిగా పశువుల పశువుల గడ్డి ఉంచేందుకు, ధాన్యం బస్తాలు నిలువ చేసేందుకు సొం తంగా ఉపయోగిస్తున్నాడు. విషయం తెలుసుకున్న గ్రా మ కార్యదర్శి తక్షణం భవనాన్ని ఖాళీ చేయాలని సదరు ఆక్రమిత వ్యక్తికి నోటీసు లిచ్చినట్లు సమాచారం. అయినా సదరు వ్యక్తి పట్టించుకోలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సదరు భవనాన్ని ఖాళీ చేయించి ప్రభుత్వ కార్యాలయానికి వినియోగించేలా పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డుపై స్తంభాల ఏర్పాటు

● ఇబ్బందులు పడుతున్న ఆర్.కరాపాడు గ్రామస్థులు

కవిటి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఆ గ్రామానికి చేరుకోవాలంటే రైల్వే గేటు దాటి ఒకే మార్గం ఉంది.. వాహనాలైనా, ప్రజలైనా రాకపోకలు సాగించాలంటే ఈ దారే ఆధారం.. అయితే రైల్వే అధి కారుల తీరుతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్. కరాపాడు గ్రామానికి ఆనుకుని రైల్వే ట్రాక్ ఉంది. అయితే రైల్వే ఆస్తులను కాపాడు కునేందుకు ట్రాక్ పక్కన వారి హద్దుల వరకు ఇనుప కంచెను ఏర్పాటు చేస్తున్నారు. దీని నిమిత్తం ఆర్.కరాపాడు గ్రామానికి జాతీయ రహదారి నుంచి వెళ్లే రోడ్డులో స్తంభాలు వేశారు. అయితే అత్యవసర పరిస్థితుల్లో అంబు లెన్స్ కూడా వెళ్లేందుకు అవకాశం లేకుండా పోతోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పదిరోజుల కిందట యూరియాతో వెళు తున్న లారీ కూరుకు పోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డా రు. ఈ విషయాన్ని జడ్ఆర్ యూసీసీ సభ్యుడు శ్రీనివాస రౌళో దృష్టికి గ్రామస్థులు తీసుకు వెళ్లగా ఆయన పలాస రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎస్.ఎన్.పండాకు వినతిపత్రం ఇచ్చారు. గ్రామస్థులకు ఇబ్బంది లేకుండా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ తానన్నారు. ప్రజాప్రతినిధులు, రైల్వే అధికారులు స్పందించి మా గ్రామానికి మార్గం ఉండేలా చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్థులు కోరుతున్నారు.


కరాపాడు గ్రామ రహదారిపై రైల్వేశాఖ వేసిన స్తంభాలు

కంచరానకు 'రొట్టమాకురేవు' కవిత్వ అవార్డు


కంచరాన భుజంగరావు

ఎచ్చెర్ల, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): బుడగట్లపాలెం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కంచరాన భుజంగ రావు రొట్టమాకురేవు కవిత్వ అవార్డు-2025కు ఎంపికయ్యారు. ఈ మేరకు తెలం గాణా రాష్ట్రం ఖమ్మంకు చెందిన ప్రముఖ కవి, కవిసంగమం నిర్వాహకుడు యాకూబ్ నుంచి సమాచారం వచ్చింది. 11 ఏళ్లుగా ప్రతి ఏటా షేక్ మహమ్మద్ స్మృత్యర్థం రొట్టమాకురేవు కవిత్వ అవార్డును తమఊరు పేరిట యాకూబ్ అందజేస్తున్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది భుజంగ రావు రాసిన 'నీటి గింజల పంట' కవితా సంపుటిని ఎంపిక చేశారు. నందిగాం మండలం బడగాం గ్రామానికి చెందిన భుజంగరావు ఈ అవార్డుకు ఎంపిక కావడంపై ఉపాధ్యాయులు, అభిమానులు, స్నేహితులు హర్షం వ్యక్తంచేసి అభినందించారు.

ఘనంగా ఆదిత్యుని తిరువీధి


నరకాసుర వధ మహోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

అరసవల్లి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో గల అరసవల్లిలో నరక చతుర్ధశి మహోత్సవం పురస్కరించుకుని ఉషాపద్మినిఛాయ సమేత సూర్యనారాయణస్వామివారి తిరువీధి మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. లక్ష్మీనారాయణులకు పురుష సూక్తవిధానంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం లోకక్షేమం, శాంతి, సకల జనుల మంగళ కాంక్షలతో నరకాసుర వధ మహోత్సవం నిర్వహించారు. అరసవల్లి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఉత్సవాల నిర్వహణకు ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు సమిష్టగా కృషి చేశారని ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్ పేర్కొన్నారు.

శ్రీముఖలింగేశ్వరుని సన్నిధిలో సేల్స్‌టాక్స్ అసిస్టెంట్ కమిషనర్


సేల్స్‌టాక్స్ ఏసీని ఆశీర్వదిస్తున్న అర్చకులు

జలుమూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగేశ్వరస్వామిని సేల్స్ టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ కేఎన్‌వీ ప్రసాద్ కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకొని పూజలు చేశారు. అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి గోత్రనామాలతో, వేద మంత్రాలతో ప్రత్యేక పూజలు చేసి అభిషేకాలు చేశారు. అనంతరం స్వామి వారి శేష వస్త్రాలు అందించి దీవించారు. శ్రీముఖలింగేశ్వరునితో పాటు వారాహి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆలయ విశిష్టతను వివరించారు. సేల్స్‌టాక్స్ ఏఈవో పాల ఆదినారాయణ, పలువురు అర్చకులు ఉన్నారు.

24న జాబ్‌మేళా

పాతపట్నం అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక కిరణ్మయి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఈనెల 24న మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయి కుమార్ తెలిపారు. ఈమేళాలో డా.రెడ్డీస్, హెట్రో, టాటా ఎలక్ట్రానిక్స్, రాయల్ ఎన్ఫీల్డ్, కియా మోటార్స్ తదితర 11 ప్రైవేటు కంపెనీలు 500పైగా ఖాళీల నియామకాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు తెలిపారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్ల మో, డిగ్రీ విద్యార్హతలు కలిగిన 18 నుంచి 30 ఏళ్ల వయస్సు లోపు యువతీయువకులు అర్హులన్నారు. ఆసక్తి పూర్తి జెరాక్స్ పత్రాలతోపాటు పాస్‌పోర్టు సైజ్ ఫొటోల తో కలిసి 24వ తేదీన ఉదయం 9గంటలకు జాబ్‌మేళా ప్రాంగణానికి చేరుకోవాలన్నారు.

విద్యతోనే మార్పు సాధ్యం

● ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యను వికసింపచేసేందుకు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం మరింత కృషి చేయల్సిన ఆవశ్యకత ఎంతో ఉందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సూచించారు. ఆదివారం స్థానిక ఒక ప్రైవేటు కళ్యాణ మండపంలో అపాస్ (ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్ యాజమాన్య సంఘం) ఆధ్వర్యంలో ఈ ఏడాది మార్చిలో నిర్వహించిన పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు అభినందన సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రమణమూర్తి మాట్లాడుతూ.. విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం లాభాపేక్ష కాకుండా సామాజిక సేవగా భావించి పేద విద్యార్థులకు అండగా నిలబడాలన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పాఠశాలలను నిర్వహించి విద్యాభివృద్ధికి సహకరించాలని సూచించారు. టెన్త్‌లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రం, మెడల్ అందించారు. కార్యక్రమంలో అపాస్ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, సంఘగౌరవ అధ్యక్షుడు ఎం. జనార్దనరావు, సుందరరావు, జిల్లా అధ్యక్షుడు అప్పలాచార్యులు, కార్యదర్శి వేణుగోపాలరావు, నరసన్నపేట మండల అపాస్ నాయకులు పాల్గొన్నారు.

బాలిదీక్ష తీసుకున్న 21 మంది భక్తులు


శ్రీముఖలింగేశ్వర సన్నిధిలో బాలిదీక్షను తీసుకున్న కమిటీ సభ్యులు

జలుమూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి) వచ్చేనెల 9న శ్రీముఖలింగంలో చేపడుతున్న బాలియాత్ర పురస్కరించుకొని బాలిదీక్షను శ్రీముఖలింగేశ్వరుని సన్నిధిలో 21 మంది కమిటీ సభ్యులు బాలి (శివ) దీక్షను తీసుకున్నారు. బాలియాత్ర విజయాన్ని కాంక్షిస్తూ బాలియాత్రర కమిటీ సభ్యులు బాలి దీక్షను తీసుకున్నట్టు కమిటీ ప్రతినిధి డాక్టర్ జీవితేజేశ్వరరావు తెలిపారు. దీక్ష చేపట్టిన భక్తులు 21 రోజులు నిష్టతో ఉండి గత ఏడాది కంటే దిగ్విజయంగా నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నట్టు తెలిపారు. వచ్చేనెల 9న నిర్వహించే బాలియాత్రకు లక్షలాదిమంది భక్తులు రానున్నట్టు తెలిపారు. ఇందుకు అవసరమైన ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

సందడిగా నందన్న నిమజ్జనం


కోయిడాన్స్ వేస్తున్న దృశ్యం

జలుమూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): లింగాలవలస గ్రామంలో ఆదివారం రాత్రి నందన్న నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పటు చేసిన పగటి వేషాలు పలువురిని ఆకట్టుకున్నాయి. నంది వాహనంపై ఆసీనులైన పార్వతీ పరమేశ్వరులను గ్రామంలో పగటి వేషాలతోను, సాము గరిడీలతోను, కోయిడాన్సులతోను గ్రామోత్సవం నిర్వహించారు. ఇంటింటా మహిళలు పార్వతీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు చేసి మంగళ హారతులు అందించి తీర్థప్రసాదాలు స్వీకరించి తరించారు. ఈ సందర్భంగా వేసిన పగటి వేషాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ గ్రామోత్సవంలో పలువురు భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి తరించారు. గ్రామోత్సవం అనంతరం నందన్నను సమీపంలో గల చెరువులో నిమజ్జనం చేశారు.

దీపావళి జాగ్రత్తగా జరుపుకోవాలి


● మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): బాణసంచా కాల్చేటప్పుడు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించి పండగను ఘనంగా జరుపుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జిల్లా ప్రజలకు సూచించారు. నిమ్మాడలోని తన క్యాంపు కార్యాలయం నుంచి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా పరుగులు తీస్తుందన్నారు. ప్రజల విశ్వాసం కూటమి ప్రభుత్వానికి బలమన్నారు. ఈ దీపావళి అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.

కలకలం రేపిన రక్తపింజరి



పామును అటవీ ప్రాంతంలో వదులుతున్న ఓంకార్



ప్రమాదకరమైన రక్తపింజరి

పలాస, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో ఆదివారం ఉదయం రక్తపింజరి కలకలం రేపింది. జగన్నాథసాగరం చెరువు సమీపంలో ఉన్న గృహాల్లో రక్త పింజరి చేరింది. స్థానికులు దీన్ని గుర్తించి అటవీశాఖ అధికారులకు తెలిపారు. ఈస్టర్న్‌ఘాట్ వైల్డ్‌లైఫ్ సొసైటీ సభ్యుడు ఓంకార్ త్యాడి దీనిని పట్టి మెండు అట వీ ప్రాంతంలో విడిచి పెట్టారు. రక్తపింజరి పాములు అతి భయంకరమైనవి. ఇవి చూడడానికి హానీ చేయ నట్టు కనిపిస్తాయి. దీని దగ్గరకు వెళితే కాటు వేయడం దీని లక్షణం. ఇటువంటి పాము కరిస్తే ఆ ప్రాంతంలో శరీరం ముక్కలుగా ఊడిపోంది. సకాలంలో వైద్యం అందించకపోతే మరణాలు జరుగుతాయని అటవీ సిబ్బంది తెలిపారు. ఎక్కువగా కొండలు, పొలాల్లో ఉండే ఇటువంటి పాములు తరచూ జనావాసాల్లోకి వస్తున్నాయన్నారు. పాముల పట్ల జాగ్రత్తగా ఉండాలని వైల్డ్‌లైఫ్ సొసైటీ సభ్యుడు ఓంకార్ తెలిపారు.

ఆలయ నిర్మాణానికి సాయం



నిర్మాణంలో ఉన్న భవానీమాత ఆలయం

కొత్తూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండల పరిధి నేరడి గ్రామంలో భవానీ మాత ఆలయ నిర్మాణానికి క్రిష్ణాపురం గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకులు బూర్లె శ్రీనివాసరావు రూ.20 వేలు విలువ చేసే 60 సిమెంట్ బస్తాలు అందజేసి దైవ భక్తిని చాటుకున్నారు. మండలంలోని ఏ గ్రామంలోనైనా ఆలయాలు నిర్మాణాలు చేస్తుంటే తనలో ఉన్న భక్తి భావం పెంపొందించేందుకు సాయం అందిస్తున్నారు. ఆలయ నిర్మాణానికి విరాళం అందించడంపై గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

బాణసంచా విక్రయాలపై అప్రమత్తంగా ఉండాలి

పాతపట్నం రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): బాణసంచా విక్రయాల్లో అప్రమత్తంగా ఉండాలని టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో విక్రయాలు చేపడుతున్న బాణసంచా సామగ్రి షాపును టెక్కలి డీఎస్పీ డి.లక్ష్మణరావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన బాణసంచా విక్రయాల్లో అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదం సంభవించే సమయంలో ఫైర్ సేఫ్టీని వినియోగించడంపై అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిబంధనలకు అనుగుణంగా అమ్మాలని తెలిపారు. ఈ క్రమంలో వారితో పాటు స్థానిక సీఐ సన్యాసినాయుడు, ఎస్‌ఐ మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

అనుమతుల్లేకుండా అమ్మితే చర్యలు

ఎల్ఎన్ పేట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): దీపావళి పండగ సందర్భంగా గ్రామాల్లో అనుమతులు లేకుండా బాణసంచా అమ్మకాలు జరిపితే అటువంటి వారిపై కేసులు నమోదు చేస్తామని సరుబుజ్జిలి ఎస్‌ఐ బి.హైమావతి తెలిపారు. మండలంలోని ప్రధాన కూడళ్లలో వ్యాపారాలు చేస్తున్న షాపులను ఆదివారం ఆమె తనిఖీలు నిర్వహించారు. మండలంలోని ఎల్ఎన్ పేట జంక్షన్, తురకపేట జంక్షన్లతో పాటు మరికొన్ని సెంటర్లలో నిఘా ఏర్పాటు చేశామన్నారు. బాణసంచా కాల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

మాదక ద్రవ్యాలకు బానిసకావొద్దు



మాట్లాడుతున్న ఎస్‌ఐ సింహాచలం

సంతబొమ్మాళి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): యువత మాదక ద్రవ్యాలకు బానిస కావద్దని ఎస్‌ఐ వై.సింహాచలం అన్నారు. ఆదివారం సంతబొమ్మాళిలో యువతకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనార్థాలపై అవగాహన కల్పించారు. అలాగే కొత్త వ్యక్తులు ఎవరైనా గ్రామాల్లో సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ముక్కు మూసుకోవలసిందే..



మహేంద్రతనయ సమీపంలోని రోడ్డు పక్కన చెత్త నిల్వలు

మెళియాపుట్టి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మెళియాపుట్టి పంచాయతీకి చెత్తసేకరణ కేంద్రం లేక సేకరించిన చెత్తా మహేంద్రతనయ నదికి సమీపంలో గల పలాస-పర్లాకిమిడి రోడ్డు పక్కనే వేస్తున్నారు. దీంతో అటుగా వెళ్లేవారు ముక్కు మూసుకొని వెళ్లాల్సి వస్తుంది. ఇటీవల కురిసిన వర్షాలకు తడిసి దుర్వాసరావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గతంలో నిర్మించిన చెత్తసేకరణ కేంద్రం స్థలాన్ని ఎకలవ్య పాఠశాలకు కేటాయించడంతో నిర్మాణం చేసినది పడగొట్టాడు. దీంతో గత ప్రభుత్వం నిర్మాణానికి నిధులు మంజూరు చేయలేదు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత టెక్కలి రోడ్డులో స్థలం కేటాయించి పిల్లర్లు వేసి వదిలేశారు. దీనితో గ్రామం నుంచి సేకరించిన చెత్త మహేంద్ర తనయ నది వైపు రోడ్డుపైనే వేయడం జరుగుతుంది. వర్షాలు పడి మహేంద్ర తనయలో కలిపి నీరు కలుషితం కావడం జరుగుతుంది. దీనితో పాటు అంత రాష్ట్ర రోడ్డు కావడంతో అధికంగా వాహనాలు రద్దీగా ఉంటుంది. అందువల్ల అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇది అంతర్రాష్ట్ర రహదారే!



గోతుల మయంగా మారిని అలికాం-బత్తిలి ప్రధానరోడ్డు

ఎల్ఎన్ పేట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): అలికాం-బత్తిలి అంతర్రాష్ట్ర ప్రధాన రహదారి పెద్దపెద్ద గుంతలతో దర్శనమిస్తుంది. ప్రయాణికులు, వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందిపడుతున్నారు. ఏళ్ల తరబడి ఇలాగే ఉన్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. బొర్రంపేట, కోవిలాం కాలనీ, తురకపేట జంక్షన్ తదితర చోట్ల గుంటలుగా ఏర్పడి ప్రమాదకరంగా మారియి. ఇలాంటి చోట్ల కొనిసార్లు వాహనాలు బోల్తాపడి ఘటనలు ఉన్నాయి. ఈ రోడ్డుగుండా నిరంతరం జిల్లాస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు రాకపోకలు సాగిస్తున్నా పట్టించుకోకపోవడంపై స్థానికులు ఆయా ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఈ రోడ్డు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

గ్రామీణ రోడ్లు.. తుఫాన్ తూట్లు


- గండ్లు పడిన రహదారులు
- అధ్వానంగా మారి..
- కాలినడకకూ ఇక్కట్లే



మందస-దేవుపురం రోడ్డు..



మాణిక్యపురం రహదారి దుస్థితి



గంద్రుగాం వద్ద కోతకు గురైన కల్వర్టు

హరిపురం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): తుఫాన్ విడిచి పది రోజులు దాటినా.. వాటి నష్టాలు ఇంకా కళ్ల ముందు కదలాడుతునే ఉన్నాయి. భారీ వర్షాలకు గ్రామీణ రోడ్లు గండ్లు పడి ప్రజలకు కడగండ్లు మిగిల్చాయి. మందస మండలంలో వివిధ పథకాలతో కోట్లాది రూపాయాల వ్యయంతో నిర్మించిన రహదారులతో పాటు, ఉపాధి పథకం కింద కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన రోడ్లు భారీ వర్షాలతో కొట్టుకుపోయి తీర ప్రాంత, ఏజెన్సీ ప్రజలకు ఇబ్బందులకు గురిచేశాయి. గత ఐదేళ్లుగా ఏటా ప్రకృతి విలయ తాండవం చేయడంతో రోడ్లకు గండ్లు పడి నాణ్యతను ప్రశ్నిస్తున్నాయి. సుమారు రూ.5 కోట్లతో నిర్మించిన బుడంబో- చీపి రోడ్డు, రూ.30 లక్షలతో చేపట్టిన డాబార్సింగి రహదారి, రూ.5 కోట్లతో నిర్మించిన తాళ్లగురండి-సిరిపురం రోడ్డు, దేవుపురం, దుమ్మూలూరు, కేసుపురం, కృష్ణాపురం, టంగరపుట్టి, నర్సింగపురం, మందస-జిల్లుండలతో పాటు జాతీయ రహదారి అండర్ పాసేజ్‌ల వద్ద ప్రత్యామ్నాయ రోడ్లకు సైతం గండ్లు పడ్డాయి. మరికొన్ని గోతులమయంగా తయారై ప్రయాణానికీ కష్టతరంగా మారాయి. కంకర, గ్రావెల్‌తో పనులు చేపట్టిన రోడ్లు కాలినడకకూ పనికిరాకుండా పోయాయి. ఈ విషయమై సంబధిత అధికారులు మండలంలో సుమారు 18 రహదారులు అధికంగా, 22 రోడ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్టు, 12 చోట్ల భారీ గండ్లు పడినట్టు తెలిపారు. రోడ్ల గండ్లను పూడ్చి, పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టి గ్రామాలకు పూర్తి స్థాయిలో రవాణా సౌకర్యం మెరుగుపర్చాలని ప్రజలు కోరుతున్నారు.

పెట్రోల్ బంక్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాలి



పాత రెవెన్యూ కార్యాలయ స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో కృష్ణమూర్తి

మెళియాపుట్టి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఉన్నపాత రెవెన్యూ భవనం వద్ద రెవెన్యూ పెట్రోల్ బంక్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాలని టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి తెలిపారు. ఆదివారం పాత భవనం ఖాళీగా ఉన్నా స్థలాన్ని ఆయన పరిశీలించారు. విలువైన స్థలం ఉందని ఎక్కడ బంక్ ఏర్పాటు చేస్తే మంచి ఆదాయం వస్తుందన్నారు. గతంలో ఈ స్థలాన్ని ఐటీడీఏ అధికారులు సైతం అడగడం జరిగిందని కాని రెవెన్యూ శాఖ ద్వారా ఏర్పాటు చేయడం వల్ల మన శాఖకే ఆదాయం వస్తేందని తెలిపారు. పరిసర ప్రాంతాల్లో పెట్రోల్ బంకు లేనందువల్ల ఇక్కడ ఏర్పాటు చేస్తే వాహనదారులకు ఉపయో గపడు తుందన్నారు. దీనికి సంబంధించిన వివరాలు పంపించాలని తెలిపారు. విలువైన స్థలం నిరుపయోగంగా ఉందని ప్రజలకు ఉపయోగపడేలా చూడాలని టీడీపీ నాయకులు కోరడంతో అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. నిబంధనల ప్రకారం బాణసంచా అమ్మకాలు సాగాలని టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి తెలిపారు. మెళియాపుట్టిలో ఏర్పాటు చేసిన బాణసంచా షాపును పరిశీలించారు. టెక్కలి డీఎస్పీ లక్ష్మణరావు, తహసీల్దార్ బి.పాపారావు, టీడీపీ నాయకులు సలాన మోహనరావు, ఎరుసు శ్రీనావాస్‌రెడ్డి, బి.దినకరరావు, పరమేష్‌రెడ్డి, వినోద్ తదితరులు ఉన్నారు.

పేదోడికి బాసటగా ప్రభుత్వ సేవలు

- ఎమ్మెల్యే మామిడి గోవిందరావు



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పాతపట్నం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పేదోడికి బాసటగా కూటమి ప్రభుత్వం సేవలు అందిస్తుందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. తన క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు రూ.99,494 సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే ఆదివారం అందజేశారు. నియోజకవర్గ పరిధిలోని హిరమండలం మండల పరిధి కల్లట గ్రామానికి చెందిన ఇప్పిలి యోగేశ్వరరావు నోటి కేన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఇతడి చికిత్సకు ఆర్థిక సహాయానికి ఎమ్మెల్యేను ఆశ్రయించారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ ఎమ్మెల్యే నివేదన మేరకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కును ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పైల బాబ్జీ, తూలుగు తిరుపతిరావు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక



సందడిగా గడిపిన పూర్వ విద్యార్థులు

వజ్రపుకొత్తూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): నగరపంల్లి హైస్కూల్‌లో 1987-88 లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం కలుసుకొని ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 38 ఏళ్ల తర్వాత కలుసుకున్న వీరు ఒకరునొకరు కలుసుకొని ఆత్మీయ పలుకరింపులు చేసుకుంటూ అలింగనం చేసుకున్నారు. ఆలనాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సన్మానించి వారి ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో ప్రస్తుత పాఠశాల కమిటీ చైర్మన్ లక్ష్మీపతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి భజనలు

పలాస, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): లక్ష ఇళ్లలో సత్యసాయి భజనలు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా స్థానిక సత్యసాయి మందిరం మాజీ కన్వీనరు, సత్యసాయి విద్యావిహార్ ఎడ్యుకేషనల్ ట్రస్టు చైర్మన్ మల్లా రామేశ్వరరావు స్వగృహంలో ఆదివారం రాత్రి ఈ కార్యక్రమం నిర్వహించారు. పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలకు చెందిన సత్యసాయి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భజనలు చేశారు. ఈ సందర్భంగా రామేశ్వరరావు విలేకరులతో మాట్లాడుతూ లోకశాంతి కోసం నిర్వహిస్తున్న కార్యక్రమానికి ప్రజలు తోడ్పాటు ఇవ్వాలని కోరారు.

అందని 'ఆయుష్మాన్' సేవలు



హెల్త్ సెంటర్ చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు

కొత్తూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో గత వైసీపీ ప్రభుత్వం నిర్మాణం చేసిన ఆయుష్మాన్ భారత్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్ సగం పనులతో దర్శనమిస్తుంది. కొత్తూరు మండలం మెట్టూరు బిట్-2 రోడ్ నెంబరు -1లో నిర్మాణం చేసిన ఈ భవనం తుప్పలు, ముళ్ల పొదలు మధ్య ఎందుకూ పనికిరాకుండా దర్శనమిస్తుంది. దీనికితోడుగా అసాంఘిక కార్యక్రమాలు, విష సర్పాలకు నిలయంగా మారింది. మూడేళ్ల కిందట నిర్వాసిత గ్రామాల్లో ఉన్న ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న సదుద్దేశంతో ఈ కేంద్రం భవనం నిర్మాణానికి సుమారు రూ.19 లక్షలు నిధులు ప్రభుత్వం కేటాయించింది. ఈ నిధులతో భవనం నిర్మాణం చేసి సగం పనులు చేసిన గుత్తేదారు తులుపు లు, ద్వారాలు, కిటికీలు వేయకుండా విడిచిపెట్టడంతో లక్షలాది రూపాలు ప్రభుత్వ ధనం నిరుపయోగంగా మారింది. ఆయుష్మాన్ భవన నిర్మాణానికి ప్రభుత్వం కేటాయించిన ఫర్నీచర్, ఇతర సామగ్రి రైతుసేవా కేంద్రంలో మూలుగుతున్నాయి. ఇక్కడే వైద్య సిబ్బంది విధులు నిర్వహించి కాలం నెట్టికొస్తున్నారు. వైద్యం కోసం వచ్చే రోగులు రైతు సేవా కేంద్రంలో తగిన వసతి లేకపోవడంతో ఇరుకైన గదిలో మందులు స్టాక్ మరో పక్క సిబ్బంది ఉండేందుకు తగిన స్థలం లేకపోవడం వలన రోగులు తనిఖీలకు వచ్చేందుకు సాహసించడంలేదు. భవన నిర్మాణ పనులు పర్యవేక్షించవల్సిన ఇంజనీరింగ్ అధికారులు చూసి చూడనట్టు ఉండడం వల్లే కాంట్రాక్టర్ సగం పనులతో విడిచి పెట్టారన్న ఆరోపణలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వ నాయకులు, అధికారులు స్పందించి ఈ హెల్త్‌సెంట్ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సందడిగా నందన్న నిమజ్జనం



కోయిడాన్స్ వేస్తున్న దృశ్యం

జలుమూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): లింగాలవలస గ్రామంలో ఆదివారం రాత్రి నందన్న నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పగటి వేషాలు పలువురిని ఆకట్టుకున్నాయి. నంది వాహనంపై ఆసీనులైన పార్వతీ పరమేశ్వరులను గ్రామంలో పగటి వేషాలతోను, సాము గరిడీలతోను, కోయిడాన్సులతోను గ్రామోత్సవం నిర్వహించారు. ఇంటింటా మహిళలు పార్వతీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు చేసి మంగళ హారతులు అందించి తీర్థప్రసాదాలు స్వీకరించి తరించారు. ఈ సందర్భంగా వేసిన పగటి వేషాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ గ్రామోత్సవంలో పలువురు భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి తరించారు. గ్రామోత్సవం అనంతరం నందన్నను సమీపంలో గల చెరువులో నిమజ్జనం చేశారు.

కుళాయి నీరు విడిచిపెట్టకపోవడంపై వివాదం



సర్పంచ్, జడ్పీటీసీ మధ్య వాగ్వాదం

హిరమండలం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుబలయి ఆర్ఆర్ కాలనీ పంచాయతీలో రక్షిత నీటి కుళాయిల ద్వారా తాగునీటిని విడిచిపెట్టకపోవడంపై వివాదం నెలకొంది. గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు పంచాయతీలో ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు దుర్వినియోగం అయ్యాయని పంచాయతీరాజ్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై కొద్దిరోజుల కిందట టెక్కలి డీఎల్‌పీవో ఐవీ రమణ విచారణ చేపట్టారు. దీంతో వివాదం రాజుకుంది. ఈ క్రమంలో ఆదివారం నీటి సరఫరా నిలిపివేశారు. దీంతో గ్రామస్థులు సర్పంచ్ లంక రోజారాణిని ప్రశ్నిస్తే.. పంచాయతీ నిధులు దుర్వినియోగం అయ్యాయని ఫిర్యాదు చేసినవారే నీటిని విడిచి పెడతారాని వారిని వెళ్లి అడగండని చెప్పారు. దీంతో గ్రామంలో కొంతమంది మహిళలు ఫిర్యాదు చేసిన వారిలో ఒకరైన బలగ వాసు ఇంటింకి వెళ్లి కుళాయిల ద్వారా నీరు విడిచి పెట్టాలని నిలదీశారు. సర్పంచ్ ఏమి తప్పు చేశారో చెప్పాలని, అంతవరకు ఇక్కడ నుంచి కదిలేది లేదని అతడి ఇంటి ముందు బైఠాయించారు. విషయం తెలుసుకున్న స్థానికుడైన జడ్పీటీసీ బుచ్చిబాబు అక్కడ చేరుకొని పరిస్థితిని చక్కదిద్దేందకు ప్రయత్నించారు. ఈ సమయంలో సర్పంచ్ వర్గీయులకు, జడ్పీటీసీ మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. మహిళలు సర్పంచ్ చేసిన నిధులు దుర్వినియోగం ఏమిటో చెప్పాలని పట్టుపట్టారు. నిధులు దుర్వినియోగం అయ్యాయో లేదో అధికారుల విచారణలో తేలుతుందని అంతవరకు వేచి చూడాలని జడ్పీటీసీ చెప్పారు. ప్రతి రోజూ నీటిని విడిచి పెట్టే వ్యక్తిని పిలిచి కుళాయిల ద్వారా నీటిని విడిచిపెట్టాలని జడ్పీటీసీ కోరారు. తనకు సర్పంచే జీతం ఇస్తున్నారని, ఆమె చెబితే విడిచి పెడతాని చెప్పడంతో ఆ జీతాలు జడ్పీటీసీ నిధుల నుంచి తాను ఇస్తానని బుచ్చిబాబు చెప్పినా ఆ వ్యక్తి అంగీకరించలేదు. పోలీసులు వారించినప్పటికీ అంగీకరించలేదు. సర్పంచ్ భర్త ఎల్‌వీ రమణ అక్కడకు చేరుకుని గ్రామానికి అన్ని విధాలుగా సేవలు అందించానని, తన సొంత నిధులు రూ.10 లక్షల వరకు ఖర్చు చేసి మౌలిక సదుపాయాలు కల్పిస్తూ వచ్చానని అయినా తనపై తప్పుడు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఇక నుంచి పంచాయతీకీ తాను ఎలాంటి సేవలు చేయలేనని, పంచాయతీ నిధులు ఉపయోగించి ఎవరైనా చేస్తే తనకు అభ్యంతరం లేదని చెప్పారు. విషయం ఎంపీడీవోకు తెలియజేయడంతో గ్రామ కార్యదర్శి వచ్చి కుళాయిల ద్వారా నీటిని విడిచి పెట్టారు.

దీపావళి జాగ్రత్తగా జరుపుకోవాలి

- మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): బాణసంచా కాల్చేటప్పుడు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించి పండగను ఘనంగా జరుపుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జిల్లా ప్రజలకు సూచించారు. నిమ్మాడలోని తన క్యాంపు కార్యాలయం నుంచి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా పరుగులు తీస్తుందన్నారు. ప్రజల విశ్వాసం కూటమి ప్రభుత్వానికి బలమన్నారు. ఈ దీపావళి అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.

24న జాబ్‌మేళా

పాతపట్నం అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక కిరణ్మయి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఈనెల 24న మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయి కుమార్ తెలిపారు. ఈమేళాలో డా.రెడ్డీస్, హెట్రో, టాటా ఎలక్ట్రానిక్స్ రాయల్ ఎన్ఫీల్డ్, కియా మోటార్స్ తదితర 11 ప్రైవేటు కంపెనీలు 500 పైచిలుకు ఖాళీల నియామకాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు తెలిపారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ విద్యార్హతలు కలిగిన 18 నుంచి 30 ఏళ్ల వయస్సు లోపు యువతీయువకులు అర్హులన్నారు. ఆసక్తి పూర్తి జెరాక్స్ పత్రాలతోపాటు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో కలిసి 24వ తేదీన ఉదయం 9గంటలకు జాబ్‌మేళా ప్రాంగణానికి చేరుకోవాలని ఆయన తెలిపారు. ఇతర వివరాలకు 8317652552 ఫోన్ నెంబరులో సంప్రదించాలని తెలిపారు.

డీఏ పెంపుపై హర్షం

సంతబొమ్మాళి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు డీఏ పెంచడం హర్షణీయమని నోబుల్ టీచర్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సూర పాపారావు, సీపాన ముకుందరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న డీఏ 33.67నకు 3.64 శాతం కరువు భత్యం పెంచి ఉద్యోగ, ఉపాధ్యాయుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని కూటమి ప్రభుత్వం నిరూపించిందన్నారు. అలాగే పీఆర్సీ, ఈఎల్ఎస్ బకాయిలు వీలైనంత తర్వగా చెల్లిస్తామని మంత్రి నారా లోకేష్ ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు.

క్రీడల వైపు మొగ్గుచూపాలి

సంతబొమ్మాళి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): యువత చదువుతో పాటు క్రీడలవైపు మొగ్గు చూపాలని ఎస్‌ఐ సింహాచలం అన్నారు. ఆదివారం నెహ్రూ యువకేంద్రం సహకారంలో సంతబొమ్మాళి యువత ఆధ్వర్యంలో యువతీ యువకులకు నిర్వహించిన క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. వాలీబాల్, ఖోఖో, రన్నింగ్, బ్యాడ్మింటన్ తదితర పోటీల్లో గెలిపొందిన వారికి అందజేశారు. కార్యక్రమంలో యువకేంద్రం ప్రతినిధులు అట్టాడ సాయికుమార్, కూచెట్టి భాను, వలంటీర్లు మధు, పీఈటీ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డీజేలు పెడితే చర్యలు

కొత్తూరు/ హిరమండలం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పోలీసులు అనుమతులు లేకుండా వినోదాలకు, వివాహాలకు డీజేలు పెడితే కఠిన చర్యలు తీసుకోనున్నట్టు సీఐ సీహెచ్ ప్రసాద్ తెలిపారు. డీజేలకు అధిక శబ్దం వల్ల వృద్ధులకు, గర్భిణులకు, హృద్రోగులు అస్వస్థతకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. అలాగే పురాతన, శిథిలావస్థలో ఉన్న భవనాలు శబ్దాలకు కూలే ప్రమాదం ఉందని, ప్రజలు ఇలాంటి భవనాలకు దూరంగా ఉండాలని కోరారు. అనుమతులు లేకుండా అధిక శబ్దాలతో డీజేలు ఏర్పాటు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వివాహ సమయాల్లో విధిగా పోలీసులు అనుమతి తీసుకోవాలన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

వజ్రపుకొత్తూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పాత టెక్కలిలో ఆదివారం పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ బి.నిహార్ తెలిపారు. టాస్క్‌ఫోర్స్ వజ్రపుకొత్తూరు పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించినట్టు తెలిపారు. వారి నుంచి రూ.32 వేలు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. పేకాటశిబిరాలు నిర్వహిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు.

పిచ్చిమొక్కలు తొలగించాలి

కోటబొమ్మాళి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలం హరిశ్చంద్రపురం గ్రామం నుంచి జాతీయ రహదారికి వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపుల చెట్లు, ముళ్లపొదలు, దట్టంగా పెరిగిన పిచ్చిమొక్కలు తొలగించాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు. ఈ రోడ్డులో మలుపులు ఎక్కువగా ఉండడంతోపాటు ఏపుగా పిచ్చి మొక్కలు ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పది రోజుల కిందట మూడు ద్విచక్ర వాహనాలు ఢీకొని నలుగురు తీవ్రంగా గాయపడ్డారని, అలాగే గతేడాది డీసీఎం వ్యాన్, ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఒకరు మృతి చెందారని గ్రామస్థులు వాపోయారు. ఈ రహదారిలో జంగిల్ క్లియరెన్సు చేయకపోవడం వల్ల నిత్యమూ ఏదో ఒక సంఘటన జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకి ఇరువైపులా జంగిల్ క్లియిరెన్స్ చేయాలని ఆ గ్రామస్థులతోపాటు వాహన చోదకులు కోరుతున్నారు.

శ్రీముఖలింగేశ్వరుని సన్నిధిలో సేల్స్‌టాక్స్ ఏసీ



ఆశీర్వదిస్తున్న అర్చకులు

జలుమూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగేశ్వరస్వామిని సేల్స్‌టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ కేఎస్‌వీ ప్రసాద్ కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకొని పూజలు చేశారు. అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి గోత్రనామాలతో, వేదమంత్రాలతో ప్రత్యేక పూజలు చేసి అభిషేకాలు చేశారు. అనంతరం స్వామి వారి శేష వస్త్రాలు అందించి దీవించారు. శ్రీముఖలింగేశ్వరునితో పాటు వారాహి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆలయ విశిష్టతను వివరించారు. సేల్స్‌టాక్స్ ఏఈవో పాల ఆదినారాయణ, పలువురు అర్చకులు ఉన్నారు.